# భ్రమ(రం)



యం.సి. శివశంకర శాస్త్రి

చిరునవ్వుతో ఎదురెళ్ళి స్నేహితురాలి చేతిలోని సూట్‌కేస్ అందుకుని లోనికి తీసుకొచ్చింది వసంత.

"కనీసం ఈ పరీక్షల నెపంతోనైనా నిన్ను చూసినట్టు అవుతుంది లెమ్మనుకుని కోరి సెంటర్ ఈ ఊరేయించుకుని నీకుత్తరం రాశానే!" అలా సోఫాలో కూచుంటూ అంది మానస.

"మొత్తంమీద జిడ్డువారి అమ్మాయివనిపించావులేవే!" నవ్వుతూ చురకేసింది వసంత.

"దెప్పి పొడవకే తల్లీ!... అద్సరేగానీ ఇంతకీ పిల్లలెంతమందే నీకు?"

"లవకుశులు" మానస ప్రశ్నకు వసంత బదులు.

కుశల ప్రశ్నల అనంతరం కాఫీ తాగుతూండగా వసంత బావగారొచ్చారు. ముందుగా మానసని అతనికి పరిచయం చేశాక "వీరు మా బావగారు. పేరు జానకిరామ్" అతని గురించి చెప్పింది వెంటనే.

పరస్పర నమస్కారానంతరం కాసేపు బాతాఖానీ సాగింది.

ఈలోగా స్కూల్‌నుంచీ పిల్లల జంట రాగానే వాళ్ళని కూడా మానసకి పరిచయం చేసి "ఒరేయ్ కుర్రకుంకలూ! పరీక్షలు రాసేందుకు ఆంటీ మనూరికొచ్చింది. మీ అల్లరి చిల్లర ప్రశ్నలతో ఆంటీని విసిగించకుండా గమ్మునుండాలి" పిల్లలకు బుద్ధిమాటలు చెప్పి "మానసా! ఎంతయినా ఈ కొంటె కుంకలతో నీ చదువు సరిగా సాగుతుందో లేదో చెప్పలేం గానీ నీ పరీక్షలయిపోయేదాకా పైన మేడ గదిలోనే వుండి ప్రశాంతంగా చదువుకో. టైమ్‌టు టైమ్ కాఫీ; టిఫిన్ వగైరాలన్నీ నేనే అక్కడికి తీసుకొచ్చి అందజేస్తూంటాను... సరేనా?"

సరేనన్నట్టు తలూపింది మానస.

రోజులు చకచకా దొర్లిపోయాయి. ఇక రేపటితో పరీక్షలు ఆఖరనంగా బాగా పొద్దుపోయేదాకా చదువుకుంటూ కూచున్న మానస రాత్రి ఒక పొద్దులో బాత్‌రూమ్ వెళ్ళాల్సొచ్చి కిందికొచ్చింది.

ఆ సమయంలో పక్షవాత రోగంతో మంచాన వాదిగి పడుకుని మెల్లిగా మూల్గుతూన్న వసంత మామగారి మూలుగు తప్ప మరే చప్పుడూ లేదు.

చప్పుడవకుండా బాత్‌రూమ్‌కేసి వెళ్తూన్న మానసకు అటు పక్కగా వసంత పడుకునే గదిలోంచి బాగా లోవాయిస్‌లో మాటలు వినిపించాయి. అనుమానం వేసి క్షణం సేపు చెవి అటు వేపుంచి మాటలు విన్న మానసకు ఆ మగ గొంతుక జానకిరామ్ దేనని తేలిగ్గా తెలిసిపోయింది.

అంతే! ఆ మరుక్షణంలోనే మానస మనసు కకావికలమై వసంత మీద ఓ రకమయిన జుగుప్స కలిగింది.

"ఛీ! ఛీ!! నంగనాచి. ఇలాంటి కులటలుండబట్టే ఆడజాతి మర్యాద సర్వస్వం మంటకలిసిపోయింది. దీని పేరు తలచుకుంటేనే పాప మావరిస్తుంది కూడా". లోలోన తెగ తిట్టుకుంటూ బాత్‌రూం వెళ్ళొచ్చి మళ్ళీ పుస్తకం చేతపట్టుక్కూచుందేగాని మనసు పాఠ్యాంశంపై నిలువకపోగా ఏవేవో ఆలోచనల్తో బుర్ర వేడెక్కిపోయింది.

మరునాడు పరీక్ష రాసి ఇంటికి రాగానే పుస్తకాలు, బట్టలూ గబగబా సర్దేసుకుంటోంది. ఈలోగా స్నేహితురాల్ని కాఫీకి పిలుద్దామని పైకొచ్చిన వసంత ఆ హడావుడి చూసి "ఏంటే! అప్పుడే అన్నీ సర్దేసుకుంటూన్నావ్? ఓ రెండ్రోజులుండి వెళ్తానన్నావుగా??"

"మొదట్లో అలాగే అనుకుని వచ్చాను."

"మరిప్పుడేమయిందీ?"

"నిన్న రాత్రి బాగా పొద్దుపోయిన మీదట నీ గదిలో నిన్నూ, నీ ముద్దుల బావనూ చూశాక మీ ప్రేమ కలాపాలకు అడ్డుండరాదన్న నిర్ణయంతో వీలైనంత తొందరగా ఇక్కణ్ణుంచీ వెళ్ళిపోవాలనుకుంటూన్నాను" సీరియస్గా చెప్పింది.

"మానసా!" కంపించిపోతూ ఘొల్లున ఏడ్చి ఏదో చెప్పబోయిన వసంతను ఇంకేమీ చెప్పనివ్వకుండా మళ్ళీ సర్దుకోవటంలో నిమగ్నమైపోయింది. ఈలోగా తలవని తలంపుగా అక్కడికొచ్చిన జానకిరాం .మానస హడావుడిని గమనించి "అరరే! అప్పుడే తిరుగు ప్రయాణానికి సిద్ధమవుతూన్నారే! రేపొక్క రోజుండి మా జామతోట చూసి వెళ్దరుగానీ లెండి మేడమ్" అని చెప్పి అతి బలవంతంమీద ఆమె ప్రయాణం ఆపుజేయించాడు ఆరోజు.

* * *

తోటలోని వాతావరణం ఎవ్వరికైనా ఆహ్లాదం కలిగించేలా వుంది గానీ మానస కదేం అనిపించటంలేదు. అందుక్కారణం మనసు బాగోలేకపోవటమే.

వాళ్ళిద్దరి వెంట వెళ్ళిన వసంత చిన్న కుమారుడు రవితేజ ఈలోగా జామకాయలు కోసుకోవటానికని ఓ చెట్టువేపు పరుగులు తీశాడు.

అదునుచూసి మానసకు మరింత చేరువగా వెళ్ళి "ఏమండీ! మీకభ్యంతరం లేకపోతే ఓ రెండు మాటలు మాటాడాలనుంది... మాటాడమంటారా?" వినయంగా అన్నాడు.

"ఏమిటది?" జానకిరాం ముఖంలోకి అనుమానంగా చూస్తూ అంది.

"మీరీవూరొచ్చి ఇన్నాళ్ళయింది కదా... మీ స్నేహితురాలి భర్తగారు... అంటే నా తమ్ముడు కనిపించటంలేదేమనే అనుమానమేమయినా వచ్చిందా మీకు?"

"ఆ!...వచ్చింది" పక్కనే వున్న గడ్డిపరక తెంపుతూ నిర్లక్ష్యంగా జవాబు.

"అతనెందుకు కనిపించటంలేదో వసంతనడిగారా?"

**"నిన్న రాత్రి బాగా పొద్దు పోయిన మీదట నీ గదిలో నిన్నూ, నీ ముద్దుల బావనూ చూశాక మీ ప్రేమ కలాపాలకు అడ్డుండ రాదన్న నిర్ణయంతో వీలైనంత తొందరగా ఇక్కణ్ణుంచీ వెళ్ళిపోవాలను కుంటున్నాను"**

"అడగలేదు" ముక్తసరి జవాబు.

"మీకభ్యంతరం లేకపోతే అతనెందుకు కనిపించటం లేదో నేనోసారి చెబుతాను- దయచేసి వినగలరా?"

కాసేపు మౌనంగావుండి అటుమీదట విధిలేక ఓ నిర్ణయానికొచ్చి అంగీకార సూచకంగా తలాడించింది మానస.

"వసంత మా మేనకోడలు. పినతల్లి చెప్పుచేతల్లో ఎన్నెన్నో కష్టాల నెదుర్కొని పెరిగిన దురదృష్ట జాతకురాలు."

"చెప్పదలచుకున్నది తిన్నగా చెప్పండి కానీ డొంక తిరుగుడు వద్దు" జానకిరాం మాటల్ని మధ్యలో కట్ చేస్తూ అంది.

"కోపమొద్దు. దయచేసి కాస్త ఓపిగ్గా వినండి" ప్రశాంతంగా పలికేడు.

"సరే! విషయమేమిటో కానివ్వండి" సీరియస్‌గా అంది మానస.

"వసంత పుట్టగానే ఆమెను నాకిచ్చి పెళ్ళిచేయాలని మా మామగారనుకున్నారు. కాలగమనంలో కొన్నేళ్ళు కొట్టుకుపోయాయి. నేను బియస్సీ ఫైనల్ పరీక్షలు రాసేందుకెళ్తుండగా దారిలో రెండెడ్లు పోట్లాడుకుంటూ వచ్చి అందులో ఒకటి నడుచుకుంటూ వెళ్తున్న నన్ను బలంగా తగలటంతో పొత్తికడుపు కింది భాగాన బలమైన దెబ్బతగిలి చివరికది ఆపరేషన్‌కి దారితీసింది. ఫలితంగా ఉత్తరోత్తరా దాంపత్య జీవితానికి అనర్హుడనని డాక్టర్లు చెప్పారు. ఈ కారణంగా నాకివ్వాలనుకున్న వసంతను మరెందుకోగాని బయట సంబంధాలకిచ్చుకో ఇష్టం లేక బలవంతంగా మా తమ్ముడికిచ్చి పెళ్ళి చేశారు.

చెడు నడవడికలకు అలవాటుపడ్డ మా తమ్ముడికి పెళ్ళికాక ముందే ఓ అమ్మాయితో అక్రమ సంబంధం వున్నందున వసంత కాపురానికొచ్చినప్పట్నుంచీ రాచిరంపాన పెట్టాడు."

"అవును గానీ ఇంతకీ ఈ భాగోతమంతా నాకెందుకు చెబుతున్నారు? చెప్పదలచుకున్నదేదో తిన్నగా చెప్పొచ్చుగా!" అదో ధోరణిలో అంది మానస.

"విషయం ఆసాంతం వినండి. ఓసారి మావాడు అక్రమ సంబంధం వున్న అమ్మాయితో కలిసి వుండగా ఆమె అన్నదమ్ములు చూసి పట్టుకుని వాణ్ణి బాగా చావబాది పైగా చంపేస్తామంటూ బెదిరించారు కూడా. ఇది జరిగిన వారానికే మావాడు తన ప్రేయసితో ఉడాయించేశాడు. ఈ కారణంగా మంచానపడ్డ మా అమ్మ ఆరునెలలు తిరక్కుండానే కళ్ళు మూసింది. మరోవంక మా నాన్నగారు పక్షవాత రోగంతో కాలు చేతులు పడిపోయి మంచాన పడి మాకెంతో భారంగా వున్నారు" చెప్పి అలా మానస వంక ఓరగా చూశాడు.

తదుపరి జరిగిన విషయం తెలుసుకోగోరి అలా జానకిరాం ముఖంలోకే గమ్మున చూస్తూండిపోయింది.

"... ... ... ...!"

"ప్లీజ్! ప్రొసీడ్!!" సౌమ్యంగా అంది.

అలా ఇల్లు వదిలి వెళ్ళిన మా తమ్ముడు ఎక్కడెక్కడో తిరిగి చివరికి ఢిల్లీ వెళ్తూ ఘోర రైలుప్రమాదంలో మరణించాడు. దైవానుగ్రహంగా వాడి దగ్గరున్న మా ఇంటి అడ్రసుకు రైల్వేవారు మెసేజ్ పంపారు. పోస్ట్ మ్యాన్ ఇంటికొచ్చిన సమయానికి నేనక్కడే వుండటంతో ఆ మెసేజ్ నేనే అందుకున్నాను. మా తమ్ముడు చనిపోయిన వార్త మా నాన్నగారికి తెలిస్తే పూర్వాచార పరాయణుడైన మా నాన్నగారు వసంతకి గుండు గీయించి, తెల్లచీర కట్టించి మొండి చేతులతో ఓ మూల కూచుండబెట్టే దాకా ఆమె చేత్తో మంచినీళ్ళు కూడా తీసుకునేవాడు కాదు. ఇవన్నీ జరక్కూడదన్న ధ్యేయంతో చివరికీ విషయం ఇప్పటివరకు వసంతకు కూడా తెలియనివ్వకుండా దాచి వుంచి లవకుశుల్లాంటి ఆ పిల్లల్తో మా తమ్ముణ్ణి చూసుకుంటూ కాలం గడుపుతున్నాను" చెప్పి మళ్ళీ మానస ముఖంలోకి చూశాడు.



**"ప్లీజ్! నన్ను క్షమించండి. నీడను నిజమని భ్రమసి నింద అంటగట్టాను. అనుమానపు పిశాచం మనిషినెంత వరకు పశువుగా మారుస్తుందో తెలిసిపోయింది. ముందు మీరు మనసారా క్షమిస్తే వెళ్ళి వసంతను కూడా క్షమాపణ కోరుకుంటాను"**

అప్పటికే మానస కనుకొలకులు చెరువులయ్యాయి.

"కాకపోతే...!" మాట సగంలోనే ఆపేశాడు జానకిరామ్.

"ఏమిటండీ ఆ కాకపోతే...? ప్లీజ్! దాచకుండా చెప్పండి" తొందర పెట్టింది.

"మీరూహించుకున్నట్టు మా ఇద్దరి మధ్యా శారీరకమయిన అక్రమ సంబంధాలేమీ లేవు. తమ్ముడి భార్య చెల్లెల్లాంటిదనే గౌరవాభిప్రాయం వున్నవాణ్ణి."

"అంటే... నిన్న మధ్యాహ్నం...!!" సందేహిస్తూ అతని ముఖంలోకి చూసింది.

"మీరు వసంతనన్న మాటలన్నీ విన్నాను. నన్ను నిలువునా కోసినంతగా బాధపడుతున్నాను. నిప్పులాంటి వసంతకు నింద అంటగట్టినందుకు నే పడుతున్న బాధ ఇంతాఅంతా కాదంటే నమ్మండి."

"మరి రాత్రంత పొద్దుల్లో మీరామెగదికెందుకెళ్ళినట్టు?" ఈసారామె ప్రశ్నల్లో సౌమ్యత కనిపించింది - అసలు విషయం తెలుసుకోవాలన్న ఉద్దేశ్యం కూడా గోచరించింది. వేదాంత ధోరణిలో నవ్వేడు జానకిరామ్.

"ప్లీజ్! నిజం చెప్పండి."

"రాత్రి మనతోపాటు భోంచేసి పడుకున్న వసంత పెద్దకొడుక్కి అజీర్తి చేసి పొద్దున్న తిన్నదంతా వాంతి చేసుకున్నాడు. ఆమె ఒక్కతే అదంతా కడిగి శుభ్రం చేస్తూంటే పక్క గదిలో పడుకున్న నాకు మెలకువ వచ్చి సాయంచేయ వెళ్ళాను. మీరు బాత్ రూంకి వెళ్ళటం; మళ్ళీ తిరిగి మీ గదిలోకి వెళ్ళిపోవటం అన్నీ గమనించాను. అయినా మీకిలాంటి హీనమయిన ఆలోచన ఎందుకు కలిగిందో నాకేం బోధపడటంలేదు" బాధగా అన్నాడు.

"అది కాదండీ...!"

"ప్లీజ్! ఇక మీరేం చెప్పొద్దు."

"దయచేసి నామాట వినండి" రిక్వెస్టింగ్ మ్యానర్‌లో అంది.

ఈసారి చేతులు జోడించాడు ఏమీ చెప్పవద్దంటూ.

మానసకు తల దిమ్మెక్కిపోయింది. జానకిరామ్ ముఖంలోకి అదోలా చూసింది.

"నాదో చిన్న రిక్వెస్ట్. ఏదయినా కళ్ళారా చూడనిదే తప్పంటగట్టడం భావ్యంకాదు. మున్ముందిలా ఎవ్వరీ అనుమానించవద్దని నా ప్రార్థన" చేతులు జోడిస్తూ జీర బోయిన స్వరంతో పల్కి బాధగా తల అటుపక్కకి తిప్పుకున్నాడు జానకిరాం.

లాగి ఛెళ్ళున చెంపదెబ్బ కొట్టినట్టయింది మానసకు.

"ప్లీజ్! నన్ను క్షమించండి. నీడను నిజమని భ్రమిసి నింద అంటగట్టాను. అనుమానపు పిశాచం మనిషినెంత వరకు పశువుగా మారుస్తుందో తెలిసిపోయింది. ముందు మీరు మనసారా క్షమిస్తే వెళ్ళి వసంతను కూడా క్షమాపణ కోరుకుంటాను" విపరీతంగా బతిమలాడింది.

తప్పు సరిదిద్దుకుంటానన్న మానస వేపు నిండు మనసుతో ప్రశాంతంగా చూశాడు జానకిరామ్.

వెంటనే ఇంటిదారి పట్టింది మానస.

★

## వివాహితని అల్లరిచేస్తే చెవి కట్

కోల్‌కతాకి 250 కిలోమీటర్ల దూరంలో ఉంది సహర్‌పూర్ అనే ఆ గ్రామం. ఒక వివాహితని అల్లరి చేయబోయిన నేరానికి ఆ గ్రామ పంచాయతీ పెద్దలు ఒక వ్యక్తిని చెవి కోయించుకుంటావా? లేక 50వేలు జరిమానా కడతావా? అని నిలదీసారు చెట్టుకు కట్టేసి మరీ. ఈ న్యాయస్థానం ధాటికి ఆ వ్యక్తి బెంబేలెత్తిపోయాడు. ఎందుకంటే గ్రామ పెద్దలు ఆ సమయానికి పదునైన మంగలి కత్తితో ఆ ఊరి కసాయివాణ్ణి కూడా పిలిపించి ఆ సమయానికి అక్కడ నిలబెట్టారు. అదాయి షేక్ అనే ఆ వ్యక్తి బట్టల వ్యాపారి. భర్త లేని సమయం చూసి, ముగ్గురు పిల్లల తల్లిఅయిన ఆమె ఇంట్లోకి రాత్రి సమయంలో చొరబడి ఆమెని అల్లరి చేయబోయాడని షేక్ మీద అభియోగం. తన భర్త లేని సమయంలో రాత్రిపూట తన ఇంట్లోకి చొరబడి, తన శీలాన్ని దోచుకోబోయాడని సిగ్గుపడకుండా ఆమె పంచాయతీ పెద్దలకి ఫిర్యాదు చేసింది. తనని చెట్టుకి కట్టేసి, విచారణ చేస్తున్నప్పుడు షేక్ నిజంగానే విపరీతంగా భయపడిపోయాడు. తనకి చాలాకాలం నుంచి ఆమె బాకీ ఉందని, దాన్ని వసూలు చేసుకోవటానికే అక్కడికి వెళ్ళానని ముందు చెప్పినా తరువాత తప్పు వొప్పుకున్నాడు. తను నేరస్థుడిగా అంగీకరించినా వదిలిపెట్టలేదు. క్షమాపణ చెప్పి పొమ్మని వదిలేయలేదు. 50వేలు కట్టు... లేదా ఒక చెవి కోయించుకో అని పెద్దలు చెప్పిన తీర్పుకి అతడు ఆపాదమస్తకం వణికిపోయాడు. షేక్ కుటుంబ సభ్యులు కల్పించుకొని, అంత కట్టలేరని, కాస్త తగ్గించమని పెద్దల్ని వేడుకున్నారు. అప్పుడు పంచాయతీ పెద్దలు మరోసారి ఆలోచనలు జరిపి, చివరికి 22వేలు ఫైన్ కట్టాలని తీర్పిచ్చారు. చివరికి ఆ జరిమానాని ఒక నెల లోపల కడతానని మాటిచ్చాక వాళ్ళు షేక్‌ని వదిలేసారట.

**- బి.ఆర్.సుంకర**